22-11-1991 శుక్రవారం 12 పేజీలు సంపుటి : 62 సంచిక 46 విడిప్రతి : రు 1.50 లు



తన పేరు పెట్టుకున్నా రన్న కరుణలో కూడా వెంకటేశ్వర స్వామి, వెంకటేశ్వర పుర వాసుల రక్షణకు కదలిరాలేదు ; పెన్న నీటిలో తెప్పం వలె తేలుతున్న గుడిశెల దృశ్యం!

# జిల్లాలో జలప్రళయం!

ఏదో పెనుభూతం జలరూపంలో తన విశాల బాహువులు బారచాచి జిల్లా అంతటినీ తన కౌగిటిలోకి తీసుకుందన్న పరిస్థితిలో వుండిన నెల్లూరు జిల్లా క్రమంగా తెరిపిన పడుతున్నది. ఆ జలరక్కసి పదఘట్టనలో నలిగి, నీరసించి, మృత సమానంగా తయారైవుంది. జిల్లా చరిత్రలో ఇంతటి జలగండం ఇదివరకెప్పుడూ ఎరుగము. గడగడ లాడించిన తుఫాన్లను, తీన్తారు చేసిపోయిన ఉప్పె చూశాము కాని సందడి లేకుండా, చప్పుడు చేయకుండా వరుసకొని పట్టపగలే అమావాశ్య నిశిరాత్రిని సృష్టించాయి.

వాన తెరిపిచ్చి, భాస్కరుడి కిరణాలు మబ్బుల ఇనుపతెరను ఛేదించుకొని క్రిందకు తొంగి చూచే టప్పటికి ..... ఏముంది ? అంతా నీళ్లు !


# జమీన్‌రైతు

స్థాపకుడు : నెల్లూరు వెంకటరామానాయుడు


ఒక్కపెట్టున జిల్లా నంతటినీ ముంచెత్తిన వెల్లువ ఇదే!

12 తేది పాడి పాడి చినుకులతో వాన ప్రారంభమైంది. వ్రక్కరోజుకల్లా అది తుఫాన్‌గా మారనుందన్న హెచ్చరిక వచ్చింది. 14 తేది మధ్యాహ్నానికి తుఫాన్ నెల్లూరుకు చేరకముందే; తమిళనాడు తీరంలో భూమిపైకి పాదం మోపిందన్న వార్త చెవిన పడింది. రేడియోలో ఆ వార్త వినగానే అందరూ రిలీఫ్ ఫీలైనారు. కాని తుఫాన్ తీరం చేరినా వానమాత్రం తగ్గలేదు. శుక్రవారం సాయంత్రానికి వాన ఉధృత రూపం దాల్చింది. ఆకాశం నుంచి ఎవరో కుండల్లో నుంచి నీళ్ల క్రుమ్మరించి నట్లే వుండింది పరిస్థితి. గంగమ్మ తల్లి శివునిపై అలిగి, ఝటాఝూటం నుంచి క్రిందకు దూకి పరుగులు పెడుతూ వస్తున్నదా అన్న ట్లుండిన ఆ కుంభవృష్టి శనివారం రాత్రివరకు విడుదలే ఇవ్వలేదు. ఆదివారం కూడా విడతలు విడతలుగా జల్లులు వచ్చాయి. ఈ నాలుగు రోజులూ సూర్యభగవానుడి దర్శనమే కాలేదు. దట్టమైన కారు మబ్బులు ఆకాశమంతా పాపపంకిలమైన భూమాత ఒడిలోని ప్రత్యణువునూ తన పవిత్ర జలంతో శుద్ధిచేయడానికి గంగమ్మ తల్లి ప్రయత్ని స్తున్నదా అన్నట్లు ఎక్కడా మట్టిరేణువు కన్పడకుండా నీరు! ఎక్కడెక్కడి పెల్ల

కొరవ 5 పేజీలో

## ఏలోకానవుందో ఆచల్లనితల్లి!



యావద్భారత జాతి ఆరాధ్య దేవతగా ఆదరణ నందుకున్న స్వర్గీయ ఇందిరాగాంధీ జన్మదినం మొన్న 19 తేది. దేశాన్ని దుఃఖ సాగరంలో ముంచి ఆ అమ్మ దివికేగి ఏడేళ్ళు గడిచినా, ఆమె స్మృతులు ప్రజానీకం హృదయాలలో ఇంకా సజీవంగానే వున్నాయి. ఆమె లేని లోటు కాంగ్రెస్ పార్టీలో కన్పిస్తూనే వుంది. దేశంకోసం ఆమె చేసిన త్యాగం; సమస్యల పట్ల ఆమె చూపిన సాహసం, చొరవ ఇంకా స్ఫూర్తినిస్తూనే వున్నాయి.

ఏలోకాన వున్నదో ఆ చల్లని తల్లి!

# ఎన్నికలవిజయంతో వెయ్యేనుగులబలం!

అదృష్టదేవత ముఖ్యమంత్రి శ్రీ ఎన్. జనార్ధన రెడ్డి ఇంట్లోనే తిష్టవేసి నట్లుంది! లేకుంటే ఇంటి మీదుగా పోతుండిన దేవతను నంద్యాల ఇండిపెండెంట్ల తరహాలో కిడ్నాప్ చేసేసి, బెడ్‌రూంలో బంధించి పెట్టి వున్నాడేమో నని కూడా అన్పిస్తూంది! ఉప ఎన్నికల తర్వాత ఉద్వాసన ఖాయం అని రాగాలు తీస్తుండిన అసమ్మతీయుల నోళ్ళు ఒక్క సారి మూత పడిపోయా యంటే ఏమనాలి? అదృష్టమా? అద్భుతమా? ఏ ఉప ఎన్నికలైతే తన పదవి కాళ్ళ క్రింద నీళ్ళు తెస్తాయని ప్రచారం జరుగు తుండిందో, అదే ఉప ఎన్నికలు తనకి వెయ్యేనుగుల బలం కల్పించే విధంగా మల్లికున్నాడు ముఖ్యమంత్రి.

రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల న్నింటిలో - నంద్యాల, కడప, పులివెందల, జగ్గంపేట, పరుచూరు, పెనుగొండ - కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. కడప -నంద్యాల పార్లమెంట్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ కీర్తి పతాకను రెప రెప లాడించాయి. పరుచూరులో సైతం కాగ్రెస్ అంతటి గెలుపు సాధించడం నిజంగా ఆశ్చర్యకర పరిణామం. తెలుగు దేశం పార్టీని, దాని అధినేత శ్రీ ఎన్. టి. రామారావును ఆంధ్రులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పరిపాలించే అర్హత నీకు లేదు కాక లేదని తీర్పు చెప్పారు. ఆయన ప్రచారంలో వచ్చిన జన సమూహాలను చూసిన వారి కెవరికీ ఫలితాలు ఇట్లా వుంటాయన్న ఊహ కూడా కల్గలేదు. ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను చండాలమైన భాషలో శాపనార్థాలు పెడు తుంటే ఒన్స్‌మోర్‌లు కొట్టిన జనమే, బ్యాలెట్ పెట్టె దగ్గరకు వచ్చేసరికి కాంగ్రెస్‌కు ఒన్‌మోర్ చాన్స్ ఇచ్చారు. కడప సంగతే చూద్దాం - ఎంతటి ప్రగల్భాలు పల్కారు, తెలుగు దేశం నాయకులు? రేణుకా చౌదరి వంటి రౌడీ రంగమ్మలను, కరాటే ఫైటర్లను దించితొడ తట్టి సవాళ్ళు విసిరి, పులివెందులలో మీటింగు పెట్టాం, మా ప్రతాపం చూశారా అని మీసాలు మెలిపెట్టి, ఓట్ల దగ్గరకు వచ్చే సరికి కవాకష్టం మీద డిపాజిట్ మాత్రం దక్కించు కున్నారు. రిగ్గింగ్ అనేది కేవలం ఓటమి పరాభవాన్ని తప్పించు కోవడానికి పెట్టే వెర్రి కేకలే! రిగ్గింగులోనే అంతటి మెజారిటీ వచ్చి వుంటే, రాజశేఖర రెడ్డికి బలం లేని జమ్మలమడుగులో తెలుగుదేశం ఎందుకు వెనుక బడింది? నక్సలైట్లతో చేతులు కలిపిన పెనుగొండలో తెలుగు దేశం ఎందుకు ఓడింది? వెంకటేశ్వరరావు చీఫ్ ఎలక్షన్ ఏజంట్‌గా పనిచేసిన పరుచూరులో ఓటమికి కారణమేమిటి?

జనార్ధన రెడ్డి ప్రభుత్వ అవినీతి


కొరవ 7 పేజీలో

## చరిత్రలో శాశ్వత స్థానం!



ప్రధాని శ్రీ పి.వి నరసింహారావు చరిత్ర ఎరుగని అఖండ మెజారిటీతో నంద్యాల నుంచి విజయం సాధించారు. ఆయన గెలుపుపై ఎవరికీ ఆశ్చర్యం లేకున్నా, 5 లక్షల 80 వేల ఆధిక్యత సాధించడం మాత్రం అపూర్వమనిపించింది. ప్రధాని అయిన తొలి తెలుగు బిడ్డ గానే కాదు, ప్రపంచంలో ఏ ప్రజాస్వామ్య దేశ ఎన్నికలలోనూ ఎవరూ సాధించలేని మెజారిటీ పొందిన వాడిగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డుల కెక్కి, చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించాడాయన.

శ్రీ పివి కి మా హృదయ పూర్వక అభినందనలు.



తుఫాన్ వార్త చెవిన పడగానే వాయు మార్గాన వచ్చి వాలిన ముఖ్యమంత్రికి వరద నష్టం ఫోటోలు చూపుతున్న కలెక్టర్ కె.రాజా.

# కామాక్షితాయి వారధికుప్పకూలింది!



కామాక్షితాయి వారధి కుప్ప కూలింది! జొన్నవాడ కామాక్షితాయిని నెల్లూరు పట్టణ చేరువకు తీసుక రావాలనే ఉద్దేశ్యంతో, కోటి రూపాయల ఖర్చుతో నిర్మించిన కాజ్‌వే ఒకే ఒక్క వరదకు సినిమా సెట్టింగుకు కట్టిన అట్టల వంతెన వలె కూలిపోయింది. రెండున్నర దశాబ్దాల పాటు కృషి చేసి, వచ్చిన పెద్ద లందరినీ అడిగి, ఆగం చేసి కట్టించు కున్న వారధి కాస్తా, రెండున్నరేళ్ళు కూడా

**నిర్మాణలోపమే కాదు, డిజైన్ కూడా తప్పేనా?**

నిలువ కుండా నీటి పాలైపోయింది.

ఎంత దారుణం? ఎంత అన్యాయం? ఎంత ఘోరం? ఎంత సిగ్గు లేని తనం? ఎంత బరి తెగించిన తనం? ఎంత నిర్లక్ష్యం? ఈ వారధిని కట్టించిన ఇంజనీర్లను, కట్టిన కాంట్రాక్టర్లను ఏమి చేయాలి? రాళ్లతో కొట్టి చంపినా, నడివీధిలో ఉరితీసినా, చెట్టుకు కట్టి కొరడా దెబ్బలు తగిలించినా, ఎత్తి ఆవారధి పైకి విసిరేసి ఆ వరద నీటిలోనే ముంచినా పాపం అవుతుందా? అయ్యో అనాలనిపిస్తుందా?

కామాక్షితాయి వారధి కోసం పాతికేళ్ళ క్రితమే ప్రయత్నం ప్రారంభ మైంది. ఇరవయ్యేళ్ళ నాడే ఇన్వెస్టిగేషన్ జరిగింది. కాని వచ్చిపోయే మంత్రులు, అధికార్లు దీన్ని పట్టించుకోనే లేదు. చివరకు నల్లప రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఎన్టీఆర్ హయాంలో, దీన్ని మంజూరు చేయించాడు. నిర్మాణం శరవేగంతో జరిగింది. శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు రెండూ ఆయనే చేశాడు. ఎన్టీ ఆర్ హయాంలో ఆరేళ్ళ పాటు మంత్రిగా వుండి శ్రీనివాసులు రెడ్డి చేసిన ఒకే ఒక మంచి పనిగా దీనికి గుర్తింపు వచ్చింది. కాని ఏమి లాభం? ఆయన రాజకీయ ప్రభ మాదిరే ఇదీ అంత రించి పోయింది.

16వతేది రాత్రి సోమశిల నుంచి విడుదలైన మూడున్నర లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహ ఉధృతిని తట్టుకో లేక మొదట రెండు స్పాన్‌లు నెర్రెలిచ్చాయి. అవి క్రమంగా పెరిగి పెద్దవై 21 తేది ఉద యానికి వారధి కాస్త నడుం విరిగిన పండు ముదుసలివలె వంగి పోయింది. నాలుగు స్పాన్‌ల వరకు పనికిరాకుండా పోయాయి. పునర్నిర్మాణానికి వీలు వస్తుందా, లేక పడగొట్టి తిరిగి కట్టాలా అనే విషయం తేలదు. అధికారుల అనధికారిక అంచనా ప్రకారం, వారధికి ఇక తిలోదకాలే! మొత్తం పడగొట్టి కడితే కాని అది వాహనయోగ్యం కాదు.

ఈ దారుణానికి కారణమేమిటి? మొదటి కారణం నిస్సందేహంగా నిర్మాణంలో లోపమే. సిమెంటుకు, కంకరకు కక్కుర్తి పడి కాంట్రాక్టరు; అతడు విసిరేసిన ఎంగిలి మెతుకులు ఏరుకోవడానికి ఇంజనీర్లు నిర్మాణంలో నాణ్యత పాటించక పోవడం వల్లనే ఇంత అనర్థం జరిగింది.

దీనికి తోడుగా, అసలు వారధి డిజైన్ లోనే లోపం వుందని చెప్తున్నారు. పెన్నానది ప్రవాహం, దాని వేగం సక్రమంగా అధ్యయనం చేయకుండా పిల్లకాల్వకుదాటు కట్టినట్లు కట్టారని చెప్తున్నారు. నిర్మాణం సమయంలోనే ఒక ఇంజనీరు డిజైన్‌లోపం ఎత్తిచూపితే, అతడ్ని పిచ్చివాడి క్రింద జమకట్టి సెలవుపై పంపించి వేశారట. అతడు చెప్పే అభ్యంతరాలను కనీసం వినను కూడాలేదట.

ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్‌గా వుండిన ఒక నెల్లూరు అధికారి ఈ వారధి ప్రతిపాదన వచ్చినపుడే ఈ స్థలంలో ప్రవాహవేగం తీవ్రంగావుంటుంది. కాబట్టి, వెనక్కు జరిపి కట్టమని సూచించాడట. దానినీ అధికారులు పట్టించుకోలేదు.

ప్రభుత్వం కట్టే వంతెనలు, వారధులు, బ్రిడ్జిలు, భవనాలు పేకమేడలవలె కూలిపోతుంటే చూస్తూ ఊరుకోవలసిందేనా? స్వర్ణముఖి బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ముందే క్రుంగింది. ఇప్పుడు అసలే కదిలి పోయింది. పెన్నవారధి కూలిపోయింది. జిల్లాలో చాలా వంతెనలు, కల్వర్టులు పడిపోయాయి. వందలాది చెరువులకు గండ్లు పడుతున్నాయి. వీటిపై ఎవరిమీదా ఎవరూ చర్యతీసుకోరు; ఎవర్ని ఎవరూ ఏమీ చేయలేరు. ప్రభుత్వ ధనాన్ని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కలిసి పంచుకతినడం ఆగేదెప్పుడో!

*


# శ్రీ నారాయణవనం రియల్ ఎస్టేట్

## శ్రీ పద్మావతి కాలని, పొగతోట, నెల్లూరు.

## ప్రథమ డ్రా 11.12.1991 బుధవారం

నెల్లూరుకు దగ్గరలో అందరికీ అందుబాటులో అతి తక్కువ ధరకు వాయిదాల పదతిలో ఇండ్ల ప్లాట్లు రూ. 200/– చొప్పున 25 నెలలు మొత్తము రూ. 5000/– మాత్రమే

**మొత్తం ప్లాట్లు 2800 -- మొత్తం సభ్యులు 2800**

మొదటి నెల బజాజ్ చేతక్, పన్నెండో నెల హీరో హోండా ఇరవై అయిదో నెల బజాజ్ చేతక్

ప్రతి నెల డ్రాలో 3 ప్లాట్లు లక్కీ డ్రా ముగ్గురు సభ్యులకు తీయబడును

1. పద్మావతి కాలని ప్లాట్లు పట్టణము కొత్తూరుకు ఉత్తరమున కలవు. 2. ప్లాట్లు విస్తీర్ణము 60 x 40 సైజు గల 33 1/3 అంకణముల ప్లాట్లు. వాస్తుకు అనుగుణంగా ప్రతి ప్లాటు కలదు. 3. విశాలమైన రోడ్లు మంచినీటి వసతి, ఎలక్ట్రిసిటీ, టెలిఫోన్ మరియు దేవాలయము వసతి కలదు. 4. మా కాలనీకి పడమర వైపున సింహపురి పబ్లిక్ స్కూలు కలదు. 5. సోమశిలకు పోవు రహదారి వున్నందున బస్సు సౌకర్యము ఎల్లవేళలందు కలదు. 6. ప్లాటుకు దక్షిణవైపున 420 ఎకరములు విమానాశ్రయం కొరకు స్థల సేకరణ జరిగి యున్నది.

మంచి ఎత్తైన ప్రదేశంలో అన్ని వసతులు కల్గిన అన్ని వర్గాల వారికి అనుకూలమైన ఇండ్ల స్థలాలు మీకు ఇకపై నెల్లూరుకు చేరువలో లభించవు.

18.11.91 తేది సోమవారం శ్రీ షిర్డి సాయిబాబా మందిరము మరియు వృద్ధుల సంక్షేమ నిలయము నిర్మాణం ప్రారంభమైనది.

వివరములకు సంప్రదించండి:

*చేవూరు వెంకటరమణయ్య యాదవ్*, రిటైర్డ్ బి.డి.ఓ.,
శ్రీ ద్వారకా నిలయము, జిల్లాపరిషత్ కాలనీ, నెల్లూరు.

*బి. గంగాధర రెడ్డి*, మునిసిపల్ కౌన్సిలర్
మేనేజింగ్ పార్ట్ నర్, పద్మావతి కాలని, పొగతోట, నెల్లూరు, ఫోన్: 27654

# శ్రీ దేవిని బుక్ చేసుకోవాలంటే ప్రపంచబ్యాంక్ అప్పు కావాలా?

శ్రీదేవి ఇటీవల తన రేటును 30 లక్షాలకు పెంచేసింది అమాంతంగా. ఎందుకని ఒక నిర్మాత అడిగితే, "మీకు తెలియనిదేముంది? ఇటీవల కేంద్రం ప్రకటించిన బడ్జెట్ మూలంగా చింతపండు, ఉప్పు మిరపకాయలు వగైరాల ధరలు పెరిగిపోయాయి కదా? అందుకు తగ్గట్టు నేనూ పెంచకపోతే ఎలా?" అందట. దానికా నిర్మాత "కొంతకాలం పోయాక ఈమెతో చిత్రం తీయాలంటే ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తీసుకోవాలేమో!" అన్నాడట నవ్వుతూ.

# 'మీ చిత్రంలో నాకూ ఒక పాత్ర ఇవ్వండి ప్లీజ్':జయప్రద

రెండు మూడు హిందీ చిత్రాలలో ఛాన్సులు వచ్చేవరికి జయప్రద తెలుగు నిర్మాతలను నిర్లక్ష్యం చేసింది. ఇటీవల ఆమె హిందీ మార్కెటు పడిపోవడంతో కొందరు తెలుగు నిర్మాతలకు ఫోన్ చేసి, "నన్ను మరచి పోయారేమిటి? మీ తదుపరి చిత్రంలో నేనే హీరోయిన్." అంటోందట. "మీరు ఆలిండియా స్టారు. నేనిప్పుడు చిన్న హీరోలతో పిక్చర్లు తీస్తున్నాను." అని ఓ నిర్మాత అంటే, "చిన్న హీరో అయితే ఏం? ఏ హీరో అయినా నేను చేయడానికి సిద్ధమే" అందట. "మా హీరో మీ పక్కన చిన్న పిల్లాడిలా కనిపిస్తాడమ్మా," అని ఆ నిర్మాత అంటే "అలాంటప్పుడు ఇంతేదైనా ఇంపార్టెంటు రోల్ ఇవ్వండి. మీ తదుపరి చిత్రంలో నేను నటించడం ఖాయం," అని లౌక్యంగా ఒత్తిడి తెస్తోందట. ఈమె ఒక హిందీ చిత్రంలో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదివరకైతే ఇద్దరు హీరోయిన్‌లు ఉండే చిత్రాలలో నటించడానికి ఈమె నిరాకరించేది. ఇంతకాలం తర్వాత ఈమె మారితే ప్రయోజనం ఏముంది? ఈ జాగురూకతేదో ముందే ఉండవలసింది. దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏమిటి?

# సెన్సార్ కత్తెర ఆడిస్తే చేతికిచిప్పమిగుల్తుందిస్వామీ!

"మితిమీరిన శృంగారం, హింస వృత్తిపరమైన, వ్యక్తిపరమైన విమర్శలు, అభ్యంతరకరమైన టైటిల్స్ సమాజంపై దుష్ప్రభావం కలిగించే ఏ విషయంపై అయినా మేము ఇక ముందు కఠినంగా వ్యవహరించగలిగాం" అన్నారు కేంద్ర సెన్సార్ సభ్యులు శ్రీ తిక్కవరపు సుబ్బరామి రెడ్డి. ఈ విషయమై తగుచర్య తీసుకోవలసిందని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది కూడా. ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించే పై అంశాలు లేకుండా చిత్రాలు తీయడం ఎలాగని బుర్రలు బద్దలు చేసుకుంటున్నారు కొందరు దర్శక నిర్మాతలు.

కేబుల్ టి.వి. డిష్ ఆంటెనా వగైరా ఆధునిక ఎలక్ట్రానిక్ ప్రక్రియల మూలంగా క్రమక్రమంగా థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసేవారి సంఖ్య తగ్గవచ్చన్న ఆందోళన నిర్మాతలలో బాగా నాటుకుపోయింది. అందుకే సాధ్యమైనంత త్వరలో నాలుగు డబ్బులు చేసుకోవాలని అందరూ తొందర పడుతున్నారు. ఈ పరిస్థితిలో సెన్సార్ వారు కఠినంగా వ్యవహరిస్తే ఎలా అని వాపోవడం సహజమే.

# విచిత్రమేమీ లేని నవ్వుల కథ "విచిత్ర ప్రేమ"

**చిత్ర సమీక్ష**
*
**గిద్దలూరు గోపాలరావు**

ప్రేక్షకులను నవ్వించటం కోసమే జంధ్యాల సినిమాలకు మాటలు వ్రాస్తాడు. దర్శకత్వం వహిస్తాడు. ఈ మూల సూత్రం " విచిత్ర ప్రేమ " సినిమాలోనూ స్థానం చేసుకుంది. జంధ్యాల దర్శకత్వంలోని చాతుర్యం, మాటల్లోని చమత్కారం విచిత్రప్రేమను చిత్ర విచిత్రంగా ఒక హాస్యచిత్రంగా రూపొందించాయి. ఇతని సినిమాలు ఎక్కువ రోజాలుండి నవ్వించలేక పోవటం ఒక వెలితి.

శివ అనే అబ్బాయి. పార్వతి అనే అమ్మాయి గాఢంగా ప్రేమించు కుంటారు. పెళ్ళి చేసుకోవాలను కుంటారు. శివకు సంహోదరుడుగా వున్న బాబ్జీ శివ పార్వతిం మధ్య కలహం రేపుతాడు. ఏది ఏమైనా గానీ ఈ జన్మలో ఒకర్నొకరు పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించు కుంటారు. అలాగని ఎవరి హాటికి వారు గప్ చిప్‌గా వుండరు. ఎక్కడ ఎదురుపడితే అక్కడ రోడ్లమీద, పొన్ల మీద ఒకరినొకరు వాడాకుగా ఆడిపోసు కుంటూ గందరగోళం సృష్టిస్తారు.

వీరి సంగతి ఇలా సాగుతుండగా ప్రాణ స్నేహితులుగా వున్న శివుడి తండ్రి సీతాపతి, పార్వతి తండ్రి ప్రతాపరావు వున్నట్టుండి బద్ధ విరోధులైపోతుంటే ఒకర్నొకరు చంపుకునే దూరం వస్తారు. దీనికి కారణం కూడా కలహప్రియుడైన బాబ్జీయే. శివను వేరే అమ్మాయికిచ్చి, పార్వతిని వేరే అబ్బాయికిచ్చి వివాహం జరిపేందుకు వారి తండ్రులు అన్ని ఏర్పాట్లు చేస్తారు. పెళ్ళికి అంతా ఒకే మంటపంలో చేరుతారు. చివరన బాబ్జీ సృష్టించిన కలహాలు, అపార్థాలు బట్టబయలు కావటంతో, శివపార్వతులు, వారి తండ్రులు కోపాలు చల్లార్చుకొని,

కొరవ 11 పేజీలో



"గంగ" లో సితార


# చిత్రాలెన్ని బోల్తాకొట్టినా బ్రహ్మానందం బిజీయే!

"ఇటీవల హాస్యనటుడు బ్రహ్మానందం నటన మొనాటనస్‌గా ఉండి యమబోర్ కొట్టిస్తోంది." అని ఎల్లెడల ప్రేక్షకులు గగ్గోలు వినిపిస్తున్నా, అతను హీరోగా ఒక చిత్రం ప్రారంభమైంది మరో నాలుగు ప్రారంభం కానున్నాయి. ఆ నిర్మాతల గుండె ధైర్యానికి మెచ్చుకోవాలి! ముంది "గౌరమ్మా నీ మొగుడెవరమ్మా". చిత్ర నిర్మాత అతన్ని బుక్ చేశాడు. వెంటనే నలుగురు నిర్మాతలు అతని వెంటపడ్డారు. వీళ్ళ సిప్పులు ఇంకా పూర్తి కాలేదు: హీరోలుగా ఇదివరకు నటించిన మురళీమోహన్, రంగనాథ్, సుధాకర్, హరిప్రసాద్, శివకృష్ణ నారాయణరావు, ఈశ్వరరావు ఇప్పుడు కేరెక్టర్ ఆర్టిస్టులుగా సైడ్ రోల్స్ ధరిస్తున్నారు.

# అక్కినేని మనసుకు వయస్సు పెరగలేదు!

"వయస్సు శరీరానికి గాని మనస్సుకు కాదుగా? అందుకే 68 ఏళ్ళ వయస్సొయినా షూటింగ్‌లో ఉన్నప్పుడు 28 ఏళ్ళ యువకుడిలా మారిపోతున్నాను." అని హమేషా చెప్పే అక్కినేని నాగేశ్వర రావు ప్రధాన పాత్రధారిగా, ఆయన సరసన లక్ష్మి నటించిన "ప్రాణదాత" చిత్రం డిసెంబరులో విడుదలవుతుంది. హరీష్, షర్మిలా, అల్లు రామలింగయ్య, పుండరీకాక్షయ్య, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, బాబూ మోహన్, నర్రా, పరుచూరి రవి, గిరీష్ కర్నాడ్, అన్నపూర్ణ, జయలలిత, చంద్రిక, కాకినేని రాజేశ్వరి, ఇతర పాత్రధారులు. కథ, మాటలు: పరుచూరి సోదరులు, దర్శకత్వం: ఎ. మోహన్ గాంధీ.

కొరవ 11 పేజీలో

CARRINA


CROWN-TV
With Technical assistance from NEC Japan
ఆథరైజ్డ్ డీలర్: నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు
స్టీరియో సౌండ్స్ ఇండియన్ బ్యాంక్ ఎదురుగా ట్రంక్‌రోడ్, నెల్లూరు
ఫోన్ 5428

Regd No. H.N.L. 18

# జలరక్కసి పదఘట్టన దృశ్యాలివీ!



కాలువలన్నీ వెల్తా వెదారం అడ్డం పడి మూసుకు పోవడంతో సౌత్ స్టేషన్ అండర్ బ్రిడ్జి కాలువగా మారి పోయింది. రెండు వైపులా రోడ్డుకు సమస్థాయిలో నీరు పారుతున్న బ్రిడ్జి ఆ ముంపులో చిక్కుక పోయిన లారీలు



వరదలకు పైర్లతో పాటు పరిశ్రమలూ పాడైపోయాయి. వెంకటేశ్వర పురంలో కవిగిరి ఎమ్మెల్యే తిరుపతి నాయుడు కుమారుడు సూర్యనారాయణకు చెందిన రవి పాలి ప్యాక్స్ ఫ్యాక్టరీలో యంత్రాలు ఎట్లా నీట మునిగి వున్నాయో చూడండి!



ప్రకృతి ప్రళయానికి గురైన ఒక కాలనీలో ప్రకృతికి విరుద్ధంగా ఒకే మంచంపై ఆశ్రయం పొంది, కలిసి కూర్చుని వున్న కుక్క, పిల్లి!



పాత పెద్దాస్పత్రి సమీపంలోని ఒక కాలనీ ఏ దురవస్థలో వుందో చూడండి!



పైన పచ్చదనం - లోపం కుళ్ళి పోయిన బోదెలు; నాలుగడుగుల నీటిలో నానుతున్న ఒక అరటితోట.



ఆనకట్ట సమీపంలో ఉరవళ్ళు, పరవళ్ళు త్రొక్కుతున్న పెన్నమ్మ!



పొర్లుకట్ట తెగి పెన్నజలము పైన బడడంతో కప్పుల వరకు నీటమునిగిన ఇళ్ళు - పాత పెద్దాస్పత్రి సమీపంలోని దృశ్యమిది.



అయుధాలస్థానంలో ఆహారపు పొట్లాలు పొట్టనిండా నింపుకుని ఎగరడానికి సిద్ధంగా వున్న వైమానిక దళం హెలికాప్టర్ లోపలి దృశ్యం.

Edited, Printed and Published by N.Dolendra Prasad at Zamin Ryot Press, Nellore OFFSET Printing at Nayagara Books Pvt, Ltd, Nellore